# కాటు

రావినూతల సువర్ణా కన్నన్



**రాయుడు** ఆ ఊరికి మకుటం లేని మహారాజు!

పందెకరాల మాగాణిగల భూస్వామి!

ఆ ఊరికి ప్రెసిడెంటు!

ఇటు హైదరాబాద్‌లోనే కాక అటు ఢిల్లీలో కూడా మంచి పలుకుబడిగల పెద్దమనిషి!

ఇంకా కోళ్ళ ఫారమ్స్, పాల వ్యాపారం కూడా ఉన్నాయి.

ఇంత ఆస్తికి వారసులు ఇద్దరే ఇద్దరు... కొడుకు కిషన్, కూతురు పద్మ.

రాయుడి వయసు దాదాపు యాభై ఏళ్ళుండవచ్చు. ఆయనకి 'సకల దుర్గుణాభిరాముడు' అన్న బిరుదు కూడా ఉంది. అయితే, గట్టిగా అనడానికి ఎవరికీ దమ్ముల్లేవు!

ఆయన కోరిన ఏ కన్నెపడుచూ తప్పించుకోలేదు. ఏ ఇంటి కొత్త కోడలూ ఆయన కంటబడ్డానికి సాహసించలేదు. అథవా ఏ పొరబాటునన్నా అతని కంటబడి అతనికి నచ్చిందో...ఇంక ఇంతే సంగతులు!

అన్ని వ్యసనాలకన్నా స్త్రీ వ్యసనం ఆయనకి చెప్పలేనంత!

పట్నంలో ఆయనకి తెలియని బ్రోతల్ హౌస్ లేదు! అందుకే మూడు మూణ్ణాలకే ఏదో పని నెపంతో వందలు వేలు పుచ్చుకుని పట్నం పోయి జల్సా చేసి వస్తుంటాడు.

ఆయన భార్య కామాక్షి దొడ్డ ఇల్లాలు! ఊరివారిక్కూడా ఆవిడంటే చాలా గౌరవం!

రాయుడికి భార్యంటే చచ్చే భయం! ఆవిడ మాట జవదాటనట్టే ఉండేవాడు!

అతని పిల్లలిద్దరూ పట్నాల్లో పెద్ద చదువులు చదువుతూ, శెలవుల్లో కూడా ఇంటికి రావడానికి ఇష్టపడరు. కారణం తండ్రి చర్యలంటే వాళ్ళకి అసహ్యం!

పిల్లలంటే ప్రేమ ఉన్నా, కామానికి దాసుడైన రాయుడు అది అంతగా పట్టించుకునేవాడు కాదు.

ఈ మధ్య ఆయనగారు పట్నం ప్రైవేట్ హాస్పటల్లో ఓ నెల్లాళ్ళుండి మొన్ననే ఊళ్ళో అడుగుపెట్టాడు.

డిశ్చార్జ్ చేస్తూ బాగా చనువున్న ఆ డాక్టర్ నిర్దయగా రాయుడికి కొన్ని ఆంక్షలు పెట్టాడు- అది తప్పావో నీ ప్రాణమో, నీ మగతనమో నిన్ను శాశ్వతంగా విడిచిపోతాయి సుమా అని!

ముఖ్యంగా, కొన్నాళ్ళపాటు తాగుడు మానేయాలి. బాగా రెస్ట్ తీసుకోవాలి. ఆరు నెల్లపాటు ఆడదాని ముఖం చూడకూడదు! మళ్ళీ ఏ ఆడపిల్ల జోలికైనా వెళ్ళావో ఆ తరువాత నీకు ఆడవాళ్ళతో అవసరమే ఉండదు!" అంటూ మరీమరీ వార్నింగ్ ఇచ్చాడు.

రాయుడి గుండెల్లో రాయి పడింది... ఆరు నెలలపాటు...ఎలా?

కాని, తప్పదు. ఇదో శాపం! తర్జనభర్జనపడి ఆర్నెల్లపాటు జాగ్రత్తగా ఉండాలనే నిర్ణయించుకున్నాడు.

అతి భారంగా పదిహేను రోజులు గడిచిపోయాయి.

ఆ రోజు ఉదయం భార్య ఇచ్చిన హార్లిక్స్ తాగుతూ ఈజీ ఛెయిర్లో కూర్చుని పేపర్ చూస్తున్నాడు రాయుడు.

అప్పుడే కామక్షి ఆలయాని కెళ్ళింది.

ఆ సమయంలో వచ్చారు-భీముడు, వీరుడు.

"ఏంట్రా! ఏంటిలా వచ్చారు?" తాగిన గ్లాసు పక్కన పెట్టి, మీసాలకంటిన హార్లిక్స్‌ని నున్నితంగా తుడుచుకుంటూ అన్నాడు రాయుడు.

"అయ్యా..." నసిగాడు భీముడు.

"ఏమిటి?"

"మరి...మరీ..."

"ఏమిట్రా?..."

"ఓ మంచి ఓర్త, బాబూ!"

"ఏమిట్రోయ్ అది?..." కుతూహలంగా అన్నాడు రాయుడు.

"తమరు రింటే...అదిరిపోతారు!"

"చెప్పేడవరా!...ఒకళ్ళ కిద్దరొచ్చారు! నానుస్తారేం!..." విసుక్కున్నాడు రాయుడు.

"ఇద్దరం గాదు, బాబూ!...నలుగురం వచ్చేసినాం!" ఉత్సాహంగా అన్నాడు వీరడు.

"ఓ! అయితే విషయం చాలా పెద్దదే అన్నమాట!...ఏంట్రా అది?..."

"అమ్మగోరు..."

"ఇంట్లో లేర్లే!...చెప్పి చావండి!"

"మన బంగ్లాలో..."

"ఊం!...మన బంగ్లాలో...?"

"అదే, బాబూ!...మన బంగ్లాలో ఓ సిలకని ఎట్టొచ్చేసినాం! అబ్బ!... కాజా నాగుంది గుంట!" ఉత్సాహంగా అన్నాడు భీముడు.

"ఏమిటి...మన బంగ్లాలోనే?" ఆనందంతో మాట్ట రాలేదు రాయుడికి.

"అవును, బాబూ! అల్లక్క డెక్కడో బొన్సు సెడిపోయితే నడిసొస్తా కంపిణీ రంగమ్మ కంటబడిందంట. అది వదిల్తాదీ...మాయ మాటలు సెప్పి ఇంటికి లాక్కెళ్ళిందంట. మేం చిలిమాచూసొస్తుంటే మేం రౌడీలనుకొని బయపడి దానెంట ఎల్లిందనుకుంటా.

మేం ఎల్లి రంగమ్మకి తమ పేరు సెప్పి ఆ పిల్లనీ మన బంగ్లాలో బందించొచ్చేసినాం!" సినిమా విలన్లా అన్నాడు వీరడు.

"తమరు విమీడియేటుగా పట్నం వచ్చి మన బంగ్లా కొచ్చేసినారా... నా సామి రంగా!" అప్పటిదాకా గడప కవతలగా నిల్చున్న మస్తాన్, జేమ్స్ కూడా లోపలికొచ్చి మండుతున్న రాయుడి కామాగ్నిలో మరో నాలుగు సమిధలు తగిలించారు.

రాయుడు గాల్లో తేలిపోయాడు.

"ఏరా వెధవల్లారా! మళ్ళీ ఎందుకు తగలడ్డారు? అసలు ఇంటికి రావద్దన్నానా!" ఉరిమింది ఆలయాన్నించి తిరిగివచ్చిన కామక్షి.

ఆవిణ్ణి చూడగానే వాళ్ళకి పైప్రాణాలు పైనే పోయాయి. పులి లాంటి రాయుడు కూడా పిల్లిలా అయిపోయాడు.

వాళ్ళు నలుగురూ అర్నెల్ల క్రితం కొత్తగా పన్లోకొచ్చారు. వచ్చిన దగ్గర్నించి గొడ్డులా పన్లు చెయ్యడమే గాక అసలే కామ పిశాచి అయిన రాయుడిలోని బ్రహ్మరాక్షసుణ్ణి తట్టిలేపి, అందుకుతగ్గ అవకాశాలు కల్పించి ఆయనవల్ల అనేక రకాలుగా లాభం పొందడం ప్రారంభించారు.

తద్వారా రాయుడి శరీరం శిధిల గృహంలా తయారైంది!

అందుకే ఆ నలుగురు అంటే కామక్షికి అసహ్యం!

"కాదు, కాముడూ!...కోళ్ళ కేదో తెగులు తగిలిందట. అది చెప్పడాని కొచ్చారంతే!" అంటూ భార్యకి నచ్చచెప్పి లోనికి పంపేశాడు రాయుడు.

ఆవిడ లోని కెళ్ళాకగానీ, తన పరిస్థితి గుర్తు రాలేదు రాయుడికి. వచ్చాక నీళ్ళు కారిపోయాడు.

"ఇంత మంచి అవకాశం వదులుకోవడమా లేకపోతే ప్రాణాలే గాదు...తన మగతనంకూడా పోతుందని చెప్పాడే ఆ డాక్టర్ వెధవ!...ఎలా?..." ఆలోచించి ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాడు.

వెంటనే ఒక వంద నోటు తీసిచ్చి రహస్యంగా భీముడి చెవిలో ఏదో ఊదాడు.

భీముడి కళ్ళు మెరిశాయి!

వాళ్ళు వెళ్ళిన తరువాత రాయుడి కళ్ళ ముందు ఆ అందాల సుందరే కదిలి ఆయన బి.పి. రెట్టింపు చేసింది.

** ** **

తెల్లవార్లూ ఊహల్లో తేలిపోయిన రాయుడి కళ్ళు నిద్రలేమికి ఎర్రగా జ్యోతుల్లా ఉన్నాయి.

భీముడి రాకకోసం, వారి అనుభవాల్ని వినడం కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాడు. అతను రాలేదు.

ఆ రెండో నాడు భీముడు రానే వచ్చాడు. కాని, అతను కంగారుగా ఉన్నాడు.

"ఏంట్రా?" ముసిముసిగా నవ్వుతూ అడిగాడు రాయుడు, భార్య పరిసరాల్లో లేదని గ్రహించి.

భీముడు, "బాబూ! గోరం జరిగిపోనాది!" కంగారుగా అన్నాడు.

"ఏమిట్రా? తప్పించుగ్గాని పోయిందా?"

"ఊం హూం!.."

"మరి? .."

"ఆ పిల్ల.. సచ్చి పోనాది!"

తృళ్ళి పడ్డాడు రాయుడు. "ఏమిటీ?.."

"ఆ పిల్ల ఉరేసుకుని సచ్చిపోనాది!"

"ఏమిటి? మన బంగ్లాలోనే?" బిగుసుకు పోయాడు రాయుడు.

"అయ్!.."

"చచ్చాం!... మిమ్మలెవరైనా చూశారా?"

"లేద్దొరా!.. ఆ రోజు తలుపులు తీసే ఉంచాం. ఎంటనే కాకుండా ఇప్పుడెందుకు ఉరోసుకుందో అర్థం గావడం లేదు!" అయోమయంగా అన్నాడు భీముడు.

"సరే!... నువ్వెళ్ళు!" ఏదో ఆలోచిస్తూ అన్నాడు రాయుడు.

"ఇదిగో! ... ఉత్తరం వచ్చింది. చూడండి!... అమ్మాయి దగ్గర్నించనుకుంటూ!" అంటూ ఓ కవరందించింది కామక్షి.

"అవును పద్మే... నా పేర రాసింది!" ఉత్సాహంగా కవరు విప్పాడు రాయుడు. సాధారణంగా పిల్లలు తన పేర ఎప్పుడూ రాయరు. తల్లికే రాస్తారు. ఈ సారి తన పేర్న ఉండే సరికి మురిసి పోయాడాయన.

"ఏం రాసింది?" అంది కామక్షి.

"ఇదిగో!... చదువుతున్నా!.." అంటూ ఉత్తరం చదవటం మొదలు పెట్టిన రాయుడి ముఖం కందిపోయింది. ఒళ్ళంతా చెమట పట్టింది. ముఖంలోని నరాలు ఉబ్బిపోయాయి. హృదయ స్పందన రెట్టింపయింది. ఉత్తరం ఆసాంతం చదివిన రాయుడు-"పద్మా!" అంటూ దిక్కులు పిక్కటిల్లేలా ఒక్క అరుపు అరిచాడు. చేతిలోని కాగితం జారి గాలికి ఓ మూలకి ఎగిరిపోయింది. తల పడక్కుర్చీ చేతి మీదికి వాలి పోయింది.

"ఏమిటండీ?" కంగారుగా ఆయన్ని కదిపింది కామక్షి.

భయంకరమైన ఆయన కేకకి తృళ్ళిపడి ఇంటి పరివారమంతా అక్కడికి చేరి పోయారు, నిన్న సాయంత్రమే దిగిన కొడుకుతో సహా.

కొడుకు తండ్రి చెయ్యి పట్టుకుని చూశాడు. రాయుడి కింక డాక్టర్లతో గానీ, మరే కన్న పిల్లలతో గానీ, అసలీ ప్రపంచతోనే ఏ సంబంధం లేకుండా మరో లోకానికి తరలి పోయాడు.


ఇల్లంతా ఏడుపులతో నిండి పోయింది.

కిషన్‌కి అయోమయంగా ఉంది.

తల్లిని ఓదారుస్తూనే నలుమూలలా చూస్తూ ఏదో ఆలోచనలో పడ్డాడు.

"పద్మా!" అన్న ఆయన కేకకి కారణభూతమైన కాగితం రెప రెపలాడుతూ కనిపించిం దతనికి. దాన్లో ఏదో భయంకరమైన వార్త దాగి ఉందని అతనికి తెలిసి పోయింది.

మెల్లగా దా న్నందుకుని చదవడం ప్రారంభించాడు.



"నాన్నా!"

నిన్ను నాన్నా అనిపిలవడం నాకు ఇష్టం లేదు. కానీ ఈ లోకాన్నించే తొలగి పోతున్న నేను, నీకు కూతుర్నయిన పాపానికి ఆఖరి సారిగా అలా సంబోధిస్తున్నాను!

మూడు రోజుల క్రితం నా స్నేహితురాలి పెళ్ళికి వెళ్ళి తిరిగి వస్తూ, చాలా రోజులైంది గదా అని అమ్మని చూసిపోవాలని బస్సెక్కాను. కానీ, అది మధ్యలో చెడిపోయింది. అర్ధరాత్రి పదకొండు గంటలు!

నిర్మానుష్యంగా ఉన్న ఆ చోటు చూస్తే నాకు చాలా భయం వేసింది.

నేను ఆలోచనలో ఉండగానే దాదాపు అందరూ వెళ్ళి పోయారు.

దూరంగా ఉన్న కాకా హోటల్ పక్కగా నిల్చున్నాను. ఆ హోటల్ వాళ్ళు కూడా మూసే ప్రయత్నంలో ఉన్నారు. అప్పుడే నలుగురు రౌడీ వెధవలు నన్ను చూసి నిల్చుండి పోయారు. వారి చూపులు చూస్తూన్న నాకు వెన్ను లోంచి ఒణుకు బయల్దేరింది.

ఎలా వీళ్ళ బారినుంచి బయట పడ్డం అని ఆలోచిస్తున్న నాకు ఓ నడివయస్సు స్త్రీ అటుకేసి వస్తూ కనిపించింది. నా ప్రాణం లేచొచ్చినట్లయింది.

నా పరిస్థితి గమనించి ఆమె ఆప్యాయంగా తన ఇంటికి ఆహ్వానించింది. ఉదయమే తనే బస్సు ఎక్కిస్తానంది. నేను సంతోషంగా ఆమె వెంట నడిచాను.

అంత రాత్రి ఆమె ఒంటరిగా అక్కడెందుకు ఉందని గానీ, ముక్కూ మొహం తెలియని నన్నెందుకు ఆహ్వానించిందని గానీ నాకు తోచలేదు.

నా ధ్యేయమల్లా ఆ రౌడీల్నుంచి తప్పించుకోవాలి! కానీ, ఆమె ఒక వేశ్య అనీ, నేను ఓ బ్రోకర్ హౌస్‌కి చేర్చబడ్డాననీ ఆలస్యంగా తెలుసుకున్నాను.

నేను షాక్‌లో ఉండగానే ఆమె ఓసారి బైటికెళ్ళి వచ్చి నన్ను బలవంతంగా ఆ నలుగురు రౌడీలకే అప్పజెప్పింది. ఏ రౌడీల బార్నించి తప్పుకుందామనుకున్నానో వారి చేతుల్లోనే పడ్డాను. వారు నన్ను మారుమూలగా ఉన్న ఓ ఇంటికి చేర్చారు. అందులో పడేసి వెళ్ళి పోయారు.

అరిచినా ఎవరికీ వినిపించని ఆ చోటున నా రోదనంతా అరణ్య రోదనే అయింది.

ఆ రాత్రి మళ్ళీ నలుగురూ వచ్చారు. అంతకు ముందు నన్ను ఆ దృష్టితో చూడని ఆ నలుగురు... అబ్బ!... ఏం రాయను, నాన్నా!... ఒక కూతురు తన తండ్రితో ఇలాంటి దారుణం ఎలా చెప్తుంది?... కానీ... అందరి లాంటి దాన్ని కాను! నీ కడుపున పుట్టిన పాపిని!... వాళ్ళు ... నలుగురూ నన్ను... ఓహ్!... ఇంక రాయలేను...

కాని... కానీ... ఇంతకన్న దారుణం ఏమిటంటే... ఆ బంగళా మనదేననీ, దాన్ని రహస్యంగా కొని నీ విలాసాల కుపయోగిస్తావనీ, ఆ నలుగురూ నీ నమ్మిన బంట్లనీ, నువ్వు డబ్బిచ్చి మరీ పంపావనీ వారు తాగుడు మైకంలో వాగుతుంటే... ఏం చెప్పన్నాన్నా!... వాళ్ళు నీ కొత్త నౌకర్లని కాస్త ముందే తెలిసినా, తన యజమాని కూతుర్నని వాళ్ళకి తెలిసినా ఈ ఘోరం జరిగేది కాదేమో! కానీ... ఆ సంగతి తెలిసే సరికే నేను పతనమైపోయాను. స్పృహ కోల్పోయిన నేను, మర్నాటిక్కానీ తేరుకోలేదు. వెంటనే ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను.

కానీ, ఇది నీ ఇల్లు!... నా శవాన్ని చూసిన వెంటనే పోలీసులు ముందు నీ ఇంటికొస్తారు. ఆ తరువాత నీ బంట్లని కలుస్తారు.

తీగ లాగితే డొంకంతా కదుల్తుంది!

అలా అని జరగడానికీ ఇష్టం లేదు!..

ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాను.

వెంటనే ఉత్తరం రాసి నీకు పోస్టు చేస్తున్నాను. ఇది నీకు అందేసరికి నేను చచ్చిపోతాను. అంటే రేపన్న మాట!

ఎవరో ఓ కన్నె పిల్లని తెచ్చాం అనగానే మురిసి పోయి డబ్బిచ్చి మరీ పంపిన నీకు ఆ పిల్ల నీ కూతురే అని తెలిసినప్పుడు.. నీ మొహం ఎలా వుంటుందో చూడాలని మహా ఆశగా ఉంది!

కాని.. అది నెరవేరదు!

అయినా, ఊహించి ఆనందిస్తున్నాను.

జుట్టు పీక్కుంటావ్!

కింద బడి దొర్లుతావ్!

పిచ్చెక్కి వీథిని పడతావ్!

అందరూ నీ మీద రాళ్ళు రువ్వుతారు! ఆడవాళ్ళు మొహాన ఉమ్ముతారు!..

కా..ని.. అమ్మ.. దేవత లాంటి అమ్మ? కూతురు పోయి, భర్తకి పిచ్చెక్కి.. కుళ్ళిపోతూ.. ఓహ్! అదే నా బాధ!

కాని, తప్పదు!.. నిన్ను పెళ్ళాడినప్పుడే ఆవిడ దురదృష్ట వంతురాలైంది!

నా ప్రాణప్రదమైన అన్నయ్య అమ్మని కంటికి రెప్పలా చూస్తాడని ఆశిస్తూ, ఈ లోకం నుంచి శాశ్వతంగా శెలవు తీసుకుంటున్నాను.

నువ్వంటే అసహ్యించుకుని, నీ కూతుర్నని చెప్పుకోవడానికి "సిగ్గు పడే పద్మ."

*


# రోగాలవిముక్తికి

**ఐదువైద్యవిధానాలు:-** ప్రతివైద్య విధానంలోను కొన్ని రోగాలనివారణకు ప్రత్యేకత ఉంది. ఈపుస్తకంలో, వచ్చింది ఏరోగమో తెలుసుకోవటానికి, ప్రతిరోగానికి రోగలక్షణాలు, వాటినివారణకు, అనుభవంగల 5 రకాలడాక్టర్లుచెప్పిన, అల్లోపతి, ఆయుర్వేద, ప్రకృతి, మూలిక, హోమియో మందుల వివరాలు, 427 రోగాలకున్నాయి. విధానాలన్నీ తెలుసుకొంటే మీకిష్టమైంది అనుసరించవచ్చును. వెల రూ. 30.

**ఆహారవైద్యము:-** మనరోగాలను నయంచేసుకోవటానికి కావలసిన మందులన్నీ మనంతినే పండ్లు, దుంపలు, కాయగూరల్లో సహజంగానేఉన్నాయి. ప్రకృతివైద్యులు, ఏరోగానికేమితినాలో తెల్పిన పూర్తివివరాలన్నీ యీపుస్తకంలో ఉన్నాయి. వెల రూ. 15-00

**మూలికావైద్యము:-** ఇంట్లోదొరికే మిరియాలు, అల్లం, జీలకర్ర మొదలైన మూలికలతో వివిధరోగాలవిముక్తికి, అనుభవంగలవారు చెప్పిన ఖర్చులేని ఎన్నోమంచి మార్గాలు, పూర్వకాలంనుంచే వాడుకలోఉన్నవి యిందులో ఉన్నాయి. రూ. 15.

తరుచువచ్చే రోగాలకయ్యే విపరీత ఖర్చు తగ్గించటానికి, పై3 తెలుగుపుస్తకాలు మీకుచాలా ఉపయోగం. అవుసరమొచ్చినపుడు ఆదుకొంటాయి. ప్రతియింటాఉండతగినవి. ఈ3 పుస్తకాలు రూ.60 కే పంపబడును. విడిగా పోష్టుఖర్చు రూ. 7 అదనము. వాటిలో ఏరెండుపుస్తకాలకైనా వి.పి.పోష్టుఖర్చులు ఉచితము.

దేశసేవప్రచురణాలు, ప్లాటు నెం.2, ఇందిరానగరు, వెంగళరావునగరు ఓవరుహెడ్ వాటరుటాంకుసమీపాన, హైదరాబాదు-500890 కు ఉత్తరంవ్రాస్తే మీకుకావలసిన పుస్తకాలు వి.పి. పోష్టుద్వారా పంపబడును. మీకెంతో ఉపయోగించేవాటికొరకు అశ్రద్ధచేయకుండా వెంటనేవ్రాయండి.



## 10 వ తరగతి విద్యార్థులారా
## 15 రోజులు సాధన చేయండి !
## గణితంలో 100 కి 100 సాధించండి !

విజయపథంలో నడిచే విద్యార్థులలో చేరండి

**10 వ తరగతి గణితశాస్త్ర పరీక్షలలో**

## నేటికి మా స్కోరు 90%

**20** జిల్లాలలో హాఫ్-ఇయర్లీ, ప్రీ-ఫైనల్ పరీక్షలలో యిచ్చిన ప్రశ్నలు **90%** మా మోడల్ టెస్ట్ పేపర్లలో ఉన్నవే! ఇంతకు ముందు గణితంలో అశ్రద్ధ చేసినా యీ అవకాశం చేజిక్కించుకోండి. కనీస విజ్ఞానాన్ని కూడా అత్యధిక మార్కులుగా మార్చుకొందుకు మా మోడల్ టెస్ట్ పేపర్లు సాధన చేయండి. రాష్ట్ర వ్యాప్తంగా మా విద్యార్థులు గణితంలో అగ్రగాములుగా ఉన్నారు. వారిలో ఒకరయే అవకాశం నేడే పొందండి!

(బోర్డు ప్రచురించిన మోడల్ ఆధారంగా)

**10** వ తరగతి గణిత శాస్త్రం

Paper - I - 10 మోడల్ టెస్ట్ పేపర్లు

Paper - II - 10 మోడల్ టెస్ట్ పేపర్లు

వెంటనే కొనండి! వెనువెంటనే సాధన చేయండి!

మొత్తం సెట్‌కు రు. **15-00 M.O.** చేయండి.

గణితంలో ప్రత్యేకత మాది! విజయం మా విద్యార్థులది!

**Praveen Publishing House**

**7-9-23, Sambamurthy Street,**
**Ramaraopeta, KAKINADA - 533 004**